భావనోపనిషత్

గ్రంథకర్త :

కనకాభిషేక గ్రహీత, సువర్ణఘంటాకంకణ

శ్రీవిద్యా రత్నాకర, శ్రీవిద్యా విశారద

శ్రీ క్రోవి పార్థసారథి

ప్రతులకు

శివకామేశ్వరి గ్రంథమాల

41-22/4-36, భ్రమరాంబాపురం,

విజయవాడ - 520 013. ఫోన్ : 522824

భావనోపనిషత్

గ్రంథకర్త :

శ్రీ క్రోవి పార్థసారథి

23-11/1-10/2, దేవీ నిలయం,
ఓగిరాలవారి వీధి,
సత్యనారాయణపురం,
విజయవాడ - 520 011.
ఫోన్ : 530672

వెల : రూ. 12-00

ప్రతులకు :

శివకామేశ్వరి గ్రంథమాల

41-22/4-36, భ్రమరాంబాపురం
కృష్ణలంక, విజయవాడ - 520 013.
ఫోన్ : 522824

ముద్రణ :
నిర్మలా ఆఫ్‌సెట్ ప్రింటర్స్
గాంధీ నగర్ విజయవాడ - 3.
ఫోన్ : 574828

Phone : 2707 (Tenkasi)

HIS HOLINESS JAGADGURU
SRI SIVA CHIDANANDA BHARATHI SWAMI
Sri Siddheswari Peetadhipati
Courtallam - 627 801.
(Via) Tenkasi - Tirunelveli Dist. --- South India
With Narayanasmritis

అభినందన

5-5-1997

దేవీ పూజలో కౌళ, సమయ మతములు, శ్రీ చక్రాంతర్గత రహస్యములు. భిన్న సంప్రదాయములలో పంచదశీ మహామంత్రము, షట్చక్రభేదనదేవి సాక్షాత్కారము, మొదలైన విషయములు పామరులకు కూడా అర్థమయ్యే రీతిలో శ్రీ క్రోవి పార్థ సారథిగారు వ్రాసిన


"శ్రీ విద్యాదర్శనము"

గ్రంథా విష్కరణ సమయమున వారిని అభినందిస్తూ కుర్తాళం సిద్ధేశ్వరీ పీఠ మహా సంస్థానామోదమున గ్రంథకర్తను

శ్రీ విద్యారత్నాకర

అను బిరుద రాజముతో సన్మానించడమయినది.

ఇతి నారాయణస్మృతిః



గ్రంథకర్త శ్రీ [illegible] సువర్ణ హస్త [illegible] కరిస్తున్న స్వామి 'వాసుదేవానందగిరి'

ప్రణతులు

పరమేశ్వరి పూజ రెండు రకాలు.

1. బాహ్య పూజ 2. అంతః పూజ

బాహ్య పూజ అంటే దేవి ప్రతిమనుగాని, శ్రీచక్రాన్నిగాని ఎదురుగా ఉంచి షోడశోపచారవిధిని అర్చించటం. దీనివలన ఐహికమైన కోరికలు తీరతాయి. అయితే

బాహ్య పూజరతాః కౌలాః క్షపణాశ్చ కపాలికాః ।
దిగంబరాశ్చేతిహాసాః వామకాస్తంత్రవాదినః ॥

ఈ రకమైన బాహ్యపూజను కౌలులు, క్షపణికులు, కాపాలికులు, దిగంబరులు, ఇతిహాసులు, వామాచారులు మొదలైన తాంత్రికులు మాత్రమే చేస్తారు. కాని వీరంతా ఐహికమైన కోరికలతో భోగలాలసులై సంసారలంపటంలో కూరుకుపోతారు.

అంతరాధనపరాస్తైదికా బ్రహ్మవాదినః ।
జీవన్ముక్తాశ్చరంత్యేతే త్రిషులోకేషు సర్వదా ॥

బ్రహ్మజ్ఞాన జిజ్ఞాసులందరూ అంతరారాధన చేస్తారు. వీరందరూ జీవన్ముక్తులై ముల్లోకాల్లోనూ సదా సంచరిస్తుంటారు. అని సనత్కుమార సంహితలో చెప్పబడింది.

అంతరారాధన అంటే సాధకుడు శ్రీచక్రాన్ని తన శరీరంలోనే భావన చేసి భావనోపనిషత్తులో చెప్పిన ప్రకారం అర్చన చెయ్యాలి.

ఉపనిషత్తులలో ముఖ్యమైనవి 108. వాటిలో దేవీ ఉపనిషత్తులు - ఎనిమిది. వాటిలో అతిముఖ్యమైనది "భావనోపనిషత్తు". ఇది మొత్తం 49 సూత్రాలుగా ఉంటుంది. దీనిలో

1 నుండి 10 సూత్రాలవరకు - మానవదేహమే శ్రీచక్రము

11 నుండి 24 సూత్రాల వరకు - శ్రీచక్రంలో నవావరణలు.

25 నుండి 49 సూత్రాల వరకు - మానసిక పూజా విధానము చెప్పబడ్డాయి.

ఈ విధంగా అంతః పూజ చేసి సిద్ధుడైన సాధకుడికి కోరిన కోరికలు అప్రయత్నంగా నెరవేరతాయి. త్రికాల జ్ఞానము, వాక్సిద్ధి లభించి జన్మాంతరము మోక్షప్రాప్తి కలుగుతుంది. అతడినే శివయోగి అంటారు.

సాక్షాత్తూ పరమేశ్వరీ స్వరూపులైన అవధూత, దత్తపీఠాధిపతి శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానందస్వామివారి సువర్ణహస్తాల మీదుగా నేను వ్రాసిన గ్రంథాలు 1-1-1998న శ్రీవిద్యా దర్పణము, 3-1-1999న శ్రీవిద్యా సర్వస్వము ఆవిష్కరింపబడినాయి. ఇప్పుడు అంటే 19-2-2000న "భావనోపనిషత్తు" ఆవిష్కరింపబడుతోంది. ఈ విధంగా మూడు సంవత్సరాలలో వరుసగా మూడు గ్రంథాలను ఆవిష్కరించి నా మీద అపారమైన కరుణ చూపిన శ్రీ స్వామి వారికి శతసహస్ర పాదాభివందనాలు.

భావనోపనిషత్తులో ఏం చెప్పబడిందో అందరూ తెలుసుకోవాలనే ఉద్దేశ్యంతోనే ఈ గ్రంథము సులభశైలిలో వ్రాయటం జరిగింది. దేవీ భక్తులూ, సాధకులూ, పండితులూ నా యీ సాహసాన్ని మన్నించి ప్రోత్సాహం అందిస్తారని ఆశిస్తూ ....

ప్రమాథినామ సంవత్సర
మాఘ శుద్ధ పూర్ణిమ, శనివారం
19-2-2000

బుధజన విధేయుడు
క్రోవి పార్థసారథి

భావనోపనిషత్

నిరాకారుడు, నిర్గుణ స్వరూపుడు పరబ్రహ్మ. అతని యొక్క ప్రతిరూపమే పరమేశ్వరి. వారే శివశక్తులు. వారి అంశలతో వచ్చినదే శ్రీచక్రము. సాధకుడు ఐహిక వాంఛలలో మునిగి తేలుతున్నప్పుడు పరదేవతను ఆరాధిస్తాడు. అంటే భగవంతుడు వేరు, భక్తుడు వేరు అని తలచి తన ఎదురుగా శ్రీచక్రము గాని, దేవి ప్రతిమ గాని ఉంచి దానిని అర్చిస్తాడు. దీనిని బాహ్యపూజ అంటారు. జ్ఞానులు, ముముక్షువులు దీనిని కౌళాచారము అంటారు. మానవాళికి కావలసినది కోర్కెల సాధనకాదు. బాహ్యపూజ అంతకన్నా కాదు. అని వారి అభిప్రాయయము. సనత్కుమార సంహితలో చెప్పినట్లుగా.

బాహ్యపూజానకర్తవ్యా కర్తవ్యా బాహ్య జాతిభి:
సా క్షుద్రఫలదా నృణాం ఐహికార్థైక సాధనాత్
బాహ్యపూజరతా: కౌలా: క్షపణాశ్చ కపాలికా:
దిగంబరాశ్చేతిహాసా: వామకాస్త్రంత్ర వాదిన:

మోక్ష వాదులకు బాహ్యపూజ లేదు. అది కేవలము ఐహికమైన కోర్కెల సాధనకే ఉపయోగపడు తుంది. ఈ బాహ్యపూజను కౌళులు, క్షపణకులు, కాపాలికులు, దిగంబరులు, వామాచార సంపన్నులు, తంత్రవాదులు మాత్రమే చేస్తారు.

అంతరారాధన పరా వైదికా బ్రహ్మవాదిన:
జీవన్ముక్తాశ్చరం త్యేతే త్రిషులోకేషు సర్వదా ॥

బ్రహ్మవాదులైన వైదికాచారసంపన్నులు అంతరారాధన చేస్తారు. వీరు జీవన్ముక్తులై ముల్లోకాలలోనూ సంచరిస్తూ ఉంటారు. జ్ఞానులు, మోక్షవాదులు ఎవరూ కూడా బాహ్య పూజ చెయ్యరు. వీరందరూ ఆత్మ సాక్షాత్కారం పొందినవారు. వీరి దృష్టిలో భగవంతుడు, భక్తుడు ఇద్దరూ ఒక్కటే. వేరుకాదు. ఆత్మసాక్షాత్కారం పొందిన వానికి ఈ జగత్తు అంతా మిధ్య అనిపిస్తుంది. అతడికి వాక్సిద్ధి కలుగుతుంది. భూత భవిష్య ద్వర్తమానాలు తెలుస్తాయి. ఈ జగత్తు అంతా తనలోనే ఉన్నది. తానే పరబ్రహ్మ స్వరూపము అని తలపోస్తాడు.

అంతరారాధన అంటే సాధకుడు తానే భగవత్స్వరూపము అని భావించి షట్చక్రాలలోనూ ఆ పరదేవతను అర్చిస్తూ కుండలినీ శక్తిని సహస్రారానికి చేర్చి పరమానందాన్ని అనుభవిస్తాడు. అంతరారాధన ఏ విధంగా చెయ్యాలి అనేది 'భావనోపనిషత్తు'లో ఇవ్వబడింది.

పరమేశ్వరిని గురించి వివరించే ఉపనిషత్తులు ఎనిమిది ఉన్నాయి. వీటిలో భావనోపనిషత్తు ఒకటి. ఇది అథర్వణ వేదములోనిది. దీనిలో అంతర్యాగము అంటే దేవి మానసిక పూజా విధానము వివరించబడింది.

భావనోపనిషత్తు పూర్తి పాఠము

ఓం శ్రీగురుః పరమకారణ భూతాశక్తిః తేన నవరంధ్రరూపోదేహః నవచక్రం రూపం శ్రీచక్రం వారాహీపితృరూపా, కురుకుళ్ళావళి దేవతామాతా ॥ పురుషార్థాస్సాగరాః దేహోనవరత్న ద్వీపః త్వగాది సప్తధాతుభిరనేకై స్సంయుక్తా సంకల్పాః కల్పతరవః తేజఃకల్పకోద్యావం రసవయాభావ్యమానా మధురామ్లతిక్తకటుకషాయలవణ రసాష్షడృతవః కియాశక్తిపీఠంకుడలినీ, జ్ఞానశక్తిర్గృహ, ఇచ్ఛాశక్తి ర్మహాత్రిపురసుందరీ. క్రియాశక్తి పీఠం కుడలినీ, జ్ఞానశక్తిర్గృహ, ఇచ్ఛాశక్తి ర్మహాత్రిపురసుందరీ జ్ఞాతాహోతా జ్ఞానమర్ఘ్యం, జ్ఞేయగ్ంహవిః జ్ఞాతృజ్ఞానజ్ఞేయోనామభేదభావనగ్ం శ్రీచక్రపూజనమ్ నియతి సహిత శృంగారాదయో నవరసా అణిమాదయః కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్య పుణ్యాపాప మయా బ్రాహ్మ్యద్యష్టశక్తయః' ఆధారనవకం ముద్రాశక్తయః పృథివ్యాపస్తేజోవాయ్వాకాశ శ్రోత్రత్వక్ చక్షుర్జిహ్వా ఘ్రాణవాక్పాణి పాదపాయూపస్థ మనోవికారా షోడశశక్తయః వచనా దానాగమన విసర్గానందహానో పాదానోపేక్షా బుద్ధ యోనంగ కుసుమాది శక్తయోష్టౌ అలంబుసా, కుహూ, విశ్వోదరీ, వరుణా, హస్తిజిహ్వా, యశస్వతీ, అశ్వనీ, గాంధారీ, పూషా, శంఖినీ, సరస్వతీ, ఇడా, పింగళా, సుషుమ్నా, చేతి, చతుర్దశనాడ్యః సర్వసంక్షోభిణ్యాది చతుర్దశ దేవతాః ప్రాణా, పాన, వ్యానో, దాన, సమాన, నాగ, కూర్మ, కృకర, దేవదత్త, ధనంజయా దశవాయవ సర్వసిద్ధిప్రదాది దేవ్యో బహిర్దశారదేవతాః ఏతద్వాయుదశక సంసర్గో పాధిభేదేన రేచకపూరక శోషక దాహక ప్లావకామృతమితి ప్రాణముఖ్యత్వేన పంచవిధోస్తి మనుష్యాణాం మోహకో దహభో భక్ష్య భోజ్య లేహ్య చోష్య పేయాత్మకం చతుర్విధమన్నం పాచయంత్యేతాః దశధనకలాసర్వజ్ఞత్వా ద్యంతర్దశారదేవతాః శీతోష్ణ సుఖదుఃఖేచ్ఛా సత్వ రజ స్తమోగుణా వశిన్యాదిశక్తయోష్టౌ శబ్ద స్పర్శ రూప రస గంధాః పంచతన్మాత్రా పంచపుష్పబాణాః మన ఇక్షుధమః వశ్యోబాణఃరాగఃపాశో ద్వేషోంశః అవ్యక్త మహత్తత్త్వాహంకారాః కామేశ్వరీ, వజ్రేశ్వరీ, భగమాలిన్యోంతస్త్రికోణాగ్రగా దేవతా పంచదశతిథి రూపేణ కాలస్య పరిమాణావలోకనం పంచదశనిత్యాః శ్రద్ధానురూపాధీర్దేవ తాతయోః కామేశ్వరీ సదానంద ఘనాపూర్ణా స్వాత్మైకరూపాదేవతా పలిలమితి సాహిత్యకరణగ్ం సత్వమ్ కర్తవ్యమకర్తవ్య మౌదాసిన్యమితి వివేక భావనాయుక్త ఉపచారః అస్తి వాస్తీతి కర్తవ్యతా

అనుపచార: తస్యబాహ్యాంత: కరణానామేకరూప విషయ గ్రహణమాసనమ్' రక్త శుక్ల పదైకీకరణం పాద్యమ్ ఉజ్జ్వల దామోదానువంధానమర్ఘ్యమ్ స్వచ్ఛంస్వతస్సిద్ధ మిత్యాచమనీయమ్ చిచ్చంద్రమయీ సర్వాంగస్రవణగ్ంస్నానమ్ చిదగ్ని స్వరూప పరమానందశక్తి స్ఫురణం వస్త్రం ప్రత్యేకగ్ం సప్తవింశతిధా భిన్నత్వేనేచ్ఛాజ్ఞాన క్రియాత్మక బ్రహ్మగ్రంథి మద్రసతంతు బ్రహ్మనాడీ బ్రహ్మసూత్రమ్ స్వవ్యతిరిక్తవస్తు సంగరహిత స్మరణంవిభూషణమ్ సత్సంగపరిపూతా మన్మరణంగంథ: సమస్త విషయాణాం మనస: స్థైర్యేణామనంధానం కుసుమమ్ తేషామేవ సర్వదాస్వీకరణంధూప: పవనావచ్ఛిన్నోర్ధ్వజ్వలన సచ్చిదుల్కాకాశదేహో దీప: సమస్తయాతాయాత వర్జనం నైవేద్యమ్ అవస్థాత్రయైకీకరణం తాంబూలమ్ మూలాధారాది బ్రహ్మబిల పర్యంతం, బ్రహ్మరంధ్రాదిమూలాధారపర్యంతం గతాగత రూపేణ ప్రాదక్షిణ్యమ్ తురీయావస్థా నమస్కార: దేహశూన్య ప్రమాతృతా నిమజ్జనం బలిహరణమ్ సత్యమస్తికర్తవ్య మకర్తవ్య మౌదాసీన్య నిత్యాత్మ విలాపనగ్ం హోమః స్వయం తత్పాదుకా నిమజ్జనం పరిపూర్ణధ్యానమ్ ఏవం ముహూర్తత్రయం భావనయా యుక్తో భవతి, తస్య దేవతాత్మైక్య సిద్ధి: చింతితకార్యాణ్యయత్నేన సిధ్యంతి స ఏవ శివయోగీతి కధ్యత ఇత్యుపనిషత్ ॥

భావనోపనిషత్తు వివరణ

భావనోపనిషత్తు మొత్తము 49 సూత్రాలుగా ఉంటుంది. దీనిలో ....

1 నుండి 10 సూత్రాల వరకు - మానవ దేహమే పరమేశ్వర స్వరూపమని

11 నుండి 24 సూత్రాల వరకు - శ్రీచక్రములోని నవావరణలను

25 నుండి 49 సూత్రాల వరకు - మానసిక పూజా విధిని వివరిస్తాయి.

1. "ఓం శ్రీగురు: పరమకారణ భూతాశక్తి:"

గురుర్బ్రహ్మ, గురుర్విష్ణు: గురుర్దేవో మహేశ్వర: ।

గురుస్సాక్షాత్పరంబ్రహ్మ తస్మై శ్రీగురవే నమ: ॥

మంత్రోపదేశం చేసి దీక్షనొసగిన గురువు త్రిమూర్తి స్వరూపుడు. అజ్ఞానమనే చీకటిని పారద్రోలి జ్ఞానమనే దీపకాంతిని చూపేమహానుభావుడు. అతని యొక్క ఉపదేశంతోనే బ్రహ్మత్వం సిద్ధిస్తుంది. అందుకే గురువు సాక్షాత్తు పరబ్రహ్మ స్వరూపము అని చెప్పబడింది.

నగురోరధికం తత్త్వం । న గురోరధికం తప: ।

తత్త్వజ్ఞానాత్ పరం నాస్తి తస్మైశ్రీ గురవేనమ: ॥

గురువుకన్న ఎక్కువ అయిన తత్త్వములేదు, తపస్సు లేదు. అతను శిష్యునకు ఉపదేశించే జ్ఞానము కన్న ఎక్కువైనది లేదు.

వందే గురపదద్వంద్వం । అనాఙ్మానస గోచరం ।

శ్వేతరక్త ప్రభాభిన్నం । శివశక్త్యాత్మకంపరం ॥

మనోవాక్కులకు గోచరించనిది, శ్వేత, రక్తకాంతుల కన్న అధికమైన కాంతినిచ్చునది, శివశక్త్యాత్మకమైనది అనగా పరబ్రహ్మ స్వరూపమైనది అయిన గురు పాదములకు నమస్కరించుచున్నాను. అందుకే **"ఓం శ్రీగురుః పరమకారణభూతాశక్తిః"** అనేగురుధ్యానంతో ఈ ఉపనిషత్తు మొదలవుతుంది.

2. *"తేన నవరంధ్రరూపోదేహః నవచక్రం రూపం శ్రీచక్రం"*

మానవదేహము నవరంధ్రములతో కూడినది. శ్రీచక్రము తొమ్మిది చక్రముల సమూహము. త్వగాదిధాతులువు తొమ్మిది. శ్రీచక్రంలోని భూపురం దగ్గర నుండి బిందువు దాకా గల ఆవరణలన్నీ మానవదేహంలోని వివిధ అంగాలు. సాధకుని దేహంలోని షట్చక్రాలు శ్రీచక్రంలోని వివిధచక్రాలతో ఐక్యము చెందుతున్నాయి. ఈ విషయాలన్నీ 'శ్రీచక్రము - మానవదేహము' అనే అధ్యాయంలో వివరించటం జరిగింది. ఈ రకంగా చూసినట్లైతే **"దేహో దేవాలయప్రాక్తో జీవోదేవస్తసాతనః"** మానవ దేహమే శ్రీచక్రము సాధకుని దేహమే దేవాలయము అని భావించాలి.

3. *వారాహీపితృరూపా, కురుకుళ్ళావళిదేవతామాతా ॥*

శ్రీచక్రానికి ప్రధానదేవత శ్రీదేవి, పరాత్పరి. ఆమె శరీరము నుంచి వచ్చిన కాంతి పుంజాలు అష్టసిద్ధులైన అణిమాది దేవతలు. అలాగే సాధకుడికి తండ్రి వారాహి, తల్లి కురుకుళ్ళావతి. ఇక్కడ 'మాతా' అంటే సాధకుని యొక్క యోగ్యతను బట్టి కోర్కెలు తీర్చునది. అంటే ఐహికవాంఛలు, మోక్షములను ప్రసాదిస్తుంది. మానవ శరీరంలో ఉన్న నాడీ మండలంలో ప్రాణనాడి అని చెప్పబడే సుషుమ్నానాడినే 'కురుకుళ్ళా' అంటారు. సుధాసింధువు మధ్య మణిద్వీపమందున్న శ్రీదేవి పట్టణానికి చిత్తము, అహంకారము అనబడే రెండు ప్రాకారాలమధ్య విమర్శరూపకమైన బావియందుండేది కురుకుళ్ళావళీ అనే దేవత. ప్రముఖమైన దేవత కాబట్టి ఈమెను మాతృదేవతగా భావించాలి. లలితాస్తవరత్నములో ఈవిధంగా చెప్పబడింది.

"కురువిందతరణి నిలయింకులాచలస్పర్ధికుచనమన్మధ్యాం ।
కుంకుమవిలిప్తగాత్రీంకురుకుళ్ళా మనసికుర్మహేసతతం" ॥

కురువిందరత్నముల పైన నివసించునది, కులపర్వతములకు మించిన స్తనములచే వంగిననడుముకలది, కుంకుమ పూయబడిన దేహము కలది అయిన కురుకుళ్లాదేవిని మనసా ధ్యానించుచున్నాను. ఛాందోగ్యోపనిషత్తులో చెప్పినట్లుగా బ్రహ్మలోకానికి వెళ్ళే మార్గంలోరెండు అమృతసరస్సులున్నాయి. అవి ఇరమ్మదీయములు అని చెప్పబడింది. ఇరము అంటే అన్నము మదీయము అంటే ఆనందము. అక్కడ అమృత వర్షముగల 'సోమసవనము' అనే వృక్షము ఉన్నది. ఆ పట్టణానికి అపరాజితము అని పేరు.

4. "పురుషార్థాస్సాగరాః"

సప్తసముద్రాలు, సప్తద్వీపాలు దాటిన తరువాత సుధాసముద్రమున్నది. దాని మధ్యలో మణిద్వీపము. మానవ దేహంలోని సప్తచక్రాలే సప్త ద్వీపాలు. ఆ పైన సప్త సముద్రాలు. ఆ తరువాత సుధాసముద్రము, మణిద్వీపము. సప్త సముద్రాలు సప్త ద్వీపాల వివరాలు ఈదిగువ ఇవ్వబడ్డాయి.

సప్త సముద్రాలు :

1) లవణ (ఉప్పు) సముద్రము, 2) ఇక్షు (చెఱుకు) సముద్రము, 3) సురా (మద్యము) సముద్రము, 4) సర్పి (నెయ్యి) సముద్రము, 5) దధి (పెరుగు) సముద్రము, 6) క్షీర (పాలు) సముద్రము, 7) జల (నీరు) సముద్రము.

సప్త ద్వీపాలు :

1) జంబూ ద్వీపము, 2) ప్లక్ష ద్వీపము, 3) కుశ ద్వీపము, 4) క్రౌంచ ద్వీపము, 5) శాక ద్వీపము, 6) శాల్మలీ ద్వీపము, 7) పుష్కర ద్వీపము

బిందుస్థానాన్ని 'ద్వాదశాంతము' అంటారు. ఆధారచక్రం దగ్గర నుండి లెక్కపెట్టినట్లైతే బిందువు పన్నెండవది అవుతుంది.

1) కుల పద్మము (మూలాధారానికి క్రిందరక్త వర్ణము గలిగిన సహస్రదళ పద్మము), 2) అష్టదళపద్మము, 3) షడ్దళపద్మము, 4) మూలాధారము, 5) స్వాధిష్ఠానము, 6) మణి పూరము, 7) అనాహతము, 8) విశుద్ధము, 9) విశుద్ధలంబికాగ్రము అష్టదళము, 10) అజ్ఞా చక్రము, 11) సహస్రకమలము, 12) అకుల పద్మము (సహస్రారకర్ణిక) దీనినే బిందు స్థానమని, చంద్రమండలమని అంటారు.

5. *"దేహో నవరత్న ద్వీపః"*

సాధకుని శరీరమే సుధా సముద్రము మధ్యలో ఉన్నటువంటి నవరత్నమయమైన ద్వీపము ఇదే మణిద్వీపము. ఆ దేవికి నిలయము. అంటే దేవి ఎక్కడో లేదు, సాధకుని శరీరంలోనే ఉన్నది.

6. *"త్వగాదిసప్తధాతుభిరనేకైస్సంయుక్తా సంకల్పాః కల్పతరవః"*

మానవదేహము ఏడుధాతువుల వలన ఏర్పడింది. వాటినే సప్త ధాతువులు అంటారు, అవి ... 1) చర్మము, 2) రక్తము, 3) మాంసము, 4) మెదడు, 5) ఎముకలు, 6) మజ్జ, 7) శుక్లము

దేవి మణిద్వీపంలోని కల్పవృక్షఛాయలో ఉంటుంది. మానవదేహంలోని సంకల్పాలే కల్పవృక్ష సముదాయము. ఆ చోటునే దేవి ఉంటుంది.

7. *"తేజఃకల్పకోద్యానం"*

సహస్రారంలోఉండే దేవి యొక్క ప్రతిబింబమే జీవ స్వరూపము, దాని యొక్క కాంతి కిరణాలే శరీరమంతా వ్యాపించి ఉన్నాయి. ఈ కిరణాల కాంతులనే 'కల్పకోద్యానము' అంటారు.

8. *"రసనయాభావ్యమానా మధురామ్లతిక్తకటుకషాయలవణరసాష్షడృతవః"*

నాలుకకు తెలిసే రుచులు ఆరు. ఈ ఆరు రుచులనే ఆరు ఋతువులుగా భావించాలి.వాటి వివరాలు ఈ విధంగా ఉంటాయి.

రుచులు		ఋతువులు
1. తీపి	-	వసంత ఋతువు
2. ఉప్పు	-	గ్రీష్మ ఋతువు
3. కారము	-	వర్ష ఋతువు
4. పులుపు	-	శరదృతువు
5. చేదు	-	హేమంత ఋతువు
6. వగరు	-	శిశిర ఋతువు

ఈ రకంగా ఇప్పటి వరకు దేవీ నివాసమైన మణిద్వీపము, సాధకుని దేహము ఒకటే అని చెప్పబడింది. ఇక పరివార దేవతల వివరణ.

9. "క్రియాశక్తి పీఠంకుడలినీ, జ్ఞానశక్తిర్గృహ, ఇచ్ఛాశక్తిర్మహాత్రిపురసుందరీ"

మానవదేహము త్రిశక్తిమయము. అవి 1) ఇచ్ఛా 2) జ్ఞాన 3) క్రియాశక్తులు. ఈ శక్తుల వలననే పనులు జరుగుతాయి. వీటిలో మొదటిదైన ఇచ్ఛాశక్తి అనేది విశ్వరూపము. జ్ఞానశక్తి అనేది మందిరము. క్రియాశక్తి అనేది పీఠము, ఏదైనా ఒక పని చేయాలనే ఆలోచన ముందుగా మెదడులో వస్తుంది. అదే ఇచ్ఛాశక్తి లేక పరాశక్తి. ఇది ఆధారాది చక్రాలగుండా పశ్యంతీ, మధ్యమా, వైఖరీ రూపములు పొందుతుంది.

10. "జ్ఞాతాహోతా జ్ఞానమర్ఘ్యం, జ్ఞేయగ్ంహవిః
జ్ఞాతృజానజ్ఞేయో నామభేద భావనగ్ం శ్రీచక్రపూజనమ్"

ఇక్కడ మూడు పదాలు చెప్పబడ్డాయి అవి

1. జ్ఞాత - విషయ పరిజ్ఞానము కలవాడు సాధకుడు
2. జ్ఞానము - తెలుసుకొనవలసినది
3. జ్ఞేయము - తెలుసుకొనబడినది.

ఈ మూడింటిని 'త్రిపుటి' అంటారు. జ్ఞానము అభివృద్ధి చెందినప్పుడు మిగిలిన రెండూ అంటే జ్ఞాత, జ్ఞేయములు దానియందు లీనమయిపోతాయి. అప్పుడు మిగిలేది జ్ఞానము ఒక్కటే. అదే పరబ్రహ్మానందము.

సాధకుడే అంతర్యాగానికి యజమాని. అతడే జ్ఞాత. అర్ఘ్యమే జ్ఞానము. జ్ఞాత, జ్ఞానము, జ్ఞేయాలను ఐక్యము చెయ్యటమే శ్రీచక్రపూజ. దేవి జ్ఞానాజ్ఞేయ స్వరూపిణి, జ్ఞానము వలన మాత్రమే తెలుసుకోతగినది. కాబట్టి త్రిపుటిని లయం చేయటమే శ్రీచక్రపూజ అయి బ్రహ్మానందాన్నిస్తుంది.

11. వియతి సహిత శృంగారాదయో నవరసా అణిమాదయః"

ప్రథమా వరణ :

ఇక్కడ శ్రీచక్ర ఆవరణ దేవతలను వివరిస్తున్నారు. చక్రార్చన భూపురం నుంచి ప్రారంభించి బిందువుతో పూర్తి చెయ్యాలి. అందుకని ప్రధమావరణ అయిన భూపుర దేవతలను వివరిస్తున్నారు.

భూపురంలో మూడు రేఖలున్నాయి. వాటిలో మొదటి రేఖయందు అన్ని వైపులా అణిమాదిసిద్ధులున్నాయి. సాధకుని శరీరంలో నవరసాలున్నాయి. ఈ నవరసాలే ప్రధమావరణలోని ప్రధమ రేఖలో ఉన్న దేవతలు. వాటి వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

సాధకుని శరీరంలోని నవరసాలు		ప్రధమ రేఖలోని దేవతలు
1. శృంగారరసము	-	అణిమాసిద్ధి
2. హాస్యరసము	-	లఘిమాసిద్ధి
3. కరుణరసము	-	గరిమాసిద్ధి
4. రౌద్రరసము	-	మహిమాసిద్ధి
5. వీరరసము	-	ఈశిత్వసిద్ధి
6. భయానకరసము	-	వశత్వసిద్ధి
7. భీభత్స రసము	-	ప్రాకామ్యసిద్ధి
8. అద్భుతరసము	-	ప్రాప్తిసిద్ధి
9. శాంత రసము	-	సర్వకామసిద్ధి

12. "కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్య పుణ్యాపాప మయా బ్రాహ్మ్యాద్యష్టశక్తయః'

భూపురంలోని రెండవ రేఖలో ఉన్న ఎనిమిది మంది దేవతలు, సాధకుని శరీరంలోని మనోవికారాలుగా చెప్పబడ్డాయి. వాటి వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

మనోవికారాలు		ద్వితీయ రేఖలోని దేవతలు
1. కామము	-	బ్రాహ్మి
2. క్రోధము	-	మహేశ్వరి
3. లోభము	-	కౌమారీ
4. మోహము	-	వైష్ణవీ
5. మదము	-	వారాహి
6. మాత్సర్యము	-	మహేంద్రీ
7. పుణ్యాము	-	చాముండా
8. పాపము	-	మహాలక్ష్మి

13. "ఆధారనవకం ముద్రాశక్తయః"

సాధకుని శరీరంలో మూలాధారం నుండి ద్వాదశాంతము వరకు గల తొమ్మిది స్థానాలు భూపురంలోని తృతీయ రేఖలోగల తొమ్మిది ముద్రాశక్తులు వాటి వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

సాధకుని శరీరంలోని స్థానాలు		ముద్రాశక్తులు
1. మూలాధారము	-	సర్వ సంక్షోభిణీ శక్తి
2. స్వాధిష్టానము	-	సర్వ విద్రావణీశక్తి
3. మణిపూరము	-	సర్వాకర్షిణీ శక్తి
4. అనాహతము	-	సర్వ వశంకరీ శక్తి
5. విశుద్ధ చక్రము	-	సర్వోన్మాదినీశక్తి
6. లంబికాగ్రము	-	సర్వమహాంకుశాశక్తి
7. ఆజ్ఞాచక్రము	-	సర్వఖేచరీశక్తి
8. సహస్రారము	-	సర్వబీజాశక్తి
9. ద్వాదశాంతము	-	సర్వయోని శక్తి

14. **"పృథివ్యాపస్తేజోవాయ్వాకాశ శ్రోత్రత్వక్ చక్షుర్జిహ్వా ఘ్రాణవాక్పాణి పాదపాయూపస్థ మనోవికారా షోడశశక్తయః"**

ద్వితీయావరణ :

శ్రీచక్రంలో రెండవ ఆవరణ షోడశదళము. దీనిలో పదహారు దళాలుంటాయి. వీటిలో పదహారు మంది ఆకర్షణ దేవతలుంటారు. వీరు పంచభూతాలు, జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు, మనస్సుల యొక్క స్వరూపాలు. వాటి వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

పంచభూతాలు, ఇంద్రియాలు		ద్వితీయావరణలోని దేవతలు
1. పృథివి	-	కామాకర్షిణీదేవి
2. జలము	-	బుద్ధ్యాకర్షిణీదేవి
3. అగ్ని	-	అహంకారాకర్షిణీదేవి
4. వాయువు	-	శబ్దాకర్షిణీదేవి
5. ఆకాశము	-	స్పర్శాకర్షిణీదేవి
6. కన్ను	-	రూపాకర్షిణీదేవి
7. ముక్కు	-	రసాకర్షిణీదేవి
8. చెవి	-	గంధాకర్షిణీదేవి
9. నాలుక	-	చిత్తాకర్షిణీదేవి
10. చర్మము	-	ధైర్యాకర్షిణీదేవి

11.వాక్కు	స్మృత్యాకర్షిణీదేవి
12. పాణి (చేయి)	నామాకర్షిణీదేవి
13. పాదము (కాలు)	బీజాకర్షిణీదేవి
14. పాయువు (గుదము)	ఆత్మాకర్షిణీదేవి
15. ఉపస్థ (రహస్యాంగము)	అమృతాకర్షిణీదేవి
16. మనస్సు	శరీరాకర్షిణీదేవి

15. 'వచనాదానాగమన విసర్గానందహానో పాదానోపేక్షా బుద్ధ యోసంగ కుసుమాది శక్త యోష్టా'

తృతీయావరణ :

శ్రీచక్రంలో తృతీయావరణ అష్టదళ పద్మము. ఇందులో ఎనిమిది దళాలుంటాయి. ఆ దళాలలో ఎనిమిది మంది దేవతలుంటారు. మానవ దేహంలో ఉండే కర్మేంద్రియాల ధర్మాలు; ప్రవృత్తి, నివృత్తి ఉపేక్ష అనేవే ఈ ఎనిమిది మంది దేవతలు. వాటి వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

ఇంద్రియ ధర్మాలు		**తృతీయావరణ దేవతలు**
1. వచనము	-	అనంగకుసుమాదేవి
2. దానము	-	అనంగమేఖలాదేవి
3. గమనము	-	అనంగమదనాదేవి
4. విసర్గము (మలవిసర్జన)	-	అనంగమదనాతురాదేవి
5. సంభోగము	-	అనంగరేఖాదేవి
6. ప్రవృత్తి	-	అనంగ వేగినీదేవి
7. నివృత్తి	-	అనంగాంకుశాదేవి
8. ఉపేక్ష	-	అనంగమాలినీదేవి

16. "అలంబుసా, కుహూ, విశ్వోదరీ, వరుణా, హస్తిజిహ్వా, యశస్వతీ, అశ్వనీ, గాంధారీ, పూషా, శంఖినీ, సరస్వతీ, ఇడా, పింగళా, సుషుమ్నా, చేతి, చతుర్దశనాడ్యః, సర్వంక్షోభిణ్యాది చతుర్దశ దేవతాః."

చతుర్థావరణ: శ్రీచక్రంలో నాలుగవ ఆవరణ చతుర్దశ కోణము. ఇందులో పద్నాలుగు కోణాలుంటాయి. అవి పద్నాలుగు లోకాలకు ప్రతీకలు. మానవ దేహంలోని పధ్నాలుగు ముఖ్యమైన నాడులే ఈ ఆవరణలో ఉండే దేవతలు. వాటి వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి

దేహంలోని నాడులు		చతుర్థావరణలోని దేవతలు
1. అలంబుసా	-	సర్వ సంక్షోభిణీదేవి
2. కుహూ	-	సర్వవిద్రావిణీదేవి
3. విశ్వోదరీ	-	సర్వాకర్షిణీదేవి
4. వరుణా	-	సర్వాహ్లాదినీదేవి
5. హస్తిజిహ్వా	-	సర్వసమ్మోహినీదేవి
6. యశస్వతీ	-	సర్వస్తంభినీదేవి
7. అశ్వనీ	-	సర్వజృంభిణీదేవి
8. గాంధారీ	-	సర్వవశంకరీదేవి
9. పూషా	-	సర్వరంజనీదేవి
10. శంఖినీ	-	సర్వోన్మాదినీదేవి
11. సరస్వతీ	-	సర్వార్థసాధికాదేవి
12. ఇడా	-	సర్వసంపత్తిపూరిణీదేవి
13. పింగళా	-	సర్వమంత్రమయీదేవి
14. సుషుమ్నా	-	సర్వద్వంద్వక్షయంకరీదేవి

17. "ప్రాణాపాన, వ్యానో, దాన, సమాన, నాగ, కూర్మ, కృకర, దేవదత్త, ధనంజయా దశవాయవ స్సర్వసిద్ధిప్రదాది దేవ్యో బహిర్దశారదేవతాః"

పంచమావరణ :

శ్రీచక్రంలోని ఐదవ ఆవరణ బహిర్దశారము. ఇక్కడ పదికోణాలున్నాయి. వాటిలో పదిమంది దేవతలున్నారు. సాధకుని శరీరంలోని ప్రధాన వాయువులు, ఉపవాయువులే ఈ దేవతలు. వాటి వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

వాయువుల పేర్లు		పంచమావరణలోని దేవతలు
1. ప్రాణవాయువు	-	సర్వసిద్ధిప్రదాదేవి
2. అపానవాయువు	-	సర్వసంపత్ప్రదాదేవి
3. వ్యానవాయువు	-	సర్వప్రియంకరీదేవి
4. ఉదానవాయువు	-	సర్వమంగళకారిణీదేవి
5. సమానవాయువు	-	సర్వకామప్రదాదేవి
6. నాగవాయువు	-	సర్వదుఃఖవిమోచనీదేవి
7. కూర్మవాయువు	-	సర్వమృత్యుప్రశమనీదేవి
8. కృకరవాయువు	-	సర్వవిఘ్ననివారిణీదేవి
9. దేవదత్తవాయువు	-	సర్వాంగసుందరీదేవి
10. ధనంజయవాయువు	-	సర్వసౌభాగ్యదాయనీదేవి

18. ***"ఏతద్వాయుదశక సంసర్గోపాధి భేదేన రేచకపూరక శోషక దాహక ప్లావకామృతమితి ప్రాణముఖ్యత్వేన పంచవిధోస్తి మనుష్యాణాం మోహకో దాహకో భక్ష్య భోజ్య లేహ్య చోష్య పేయాత్మకం చతుర్విధమన్నం పాచయంత్యేతా: దశవహ్నికలాస్సర్వజ్ఞత్వా ద్యంతర్దశారదేవతా:***

షష్టమావరణ

ఇందులో ఆరవ ఆవరణ అంతర్దశారము, దీనిలో కూడా పది కోణాలుంటాయి. ఈ కోణాలలో పదిమంది దేవతలున్నారు. సాధకుని శరీరంలోని దశవిధవాయువుల వల్ల కలిగే గుణాలు చతుర్విధాన్నములు పచనము చేయుశక్తులే ఈ దేవతలు. ఈ ఆవరణలోని పది దేవతల వివరాలు ఈ దిగువ ఇవ్వబడినాయి.

వాయువుల గుణములు		షష్టమావరణ దేవతలు
1. రేచక(ఊపిరి విడచుట)	-	సర్వజ్ఞాదేవి
2. పూరక(ఊపిరి పూరించుట)	-	సర్వశక్తిదేవి
3. శోషక(శోషిల్లుట)	-	సర్వైశ్వర్యప్రదాయిని
4. దాహక(దాహకగుణము)	-	సర్వజ్ఞానమయి
5. ప్లావక(ప్లావకగుణము)	-	సర్వవ్యాధి నివారిణి

వివిధ అన్నములు

1. భక్ష్యము (తినదగినది)	-	సర్వాధారస్వరూపిణి దేవి
2. భోజ్యము (భుజింపతగినది)	-	సర్వపాపహరాదేవి
3. లేహ్యము (నాకి భుజింపతగినది)	-	సర్వానందమయిదేవి
4. చోష్యము (పీల్చుతగినది)	-	సర్వరక్షాసర్వరూపిణి
5. పేయము (త్రాగతగినది)	-	సర్వేపిసత్ఫల ప్రదాదేవి.

19. "శీతోష్ణ సుఖదుఃఖేచ్ఛా సత్త్వరజస్తమోగుణా వశిన్యాది శక్త యోష్టా"

సప్తమావరణ :

శ్రీచక్రంలో ఏడవ ఆవరణ అష్టకోణము. దీని ఎనిమిది కోణాలలోనూ ఎనిమిది మంది దేవతలున్నారు. వారుకూడా సాధకుని శరీరంలో ఉండే లక్షణాలే. వాటి వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

సాధకుని శరీరంలో గల లక్షణాలు		సప్తమావరణలోని దేవతలు
1. శీతము	-	వశినీ
2. ఉష్ణము	-	కామేశ్వరీ
3. సుఖము	-	మోదినీ
4. దుఃఖము	-	విమలా
5. ఇచ్ఛ	-	అరుణా
6. సత్వగుణము	-	జయినీ
7. రజోగుణము	-	సర్వేశ్వరీ
8. తమోగుణము	-	కౌళినీ

10 . "శబ్ద స్పర్శ రూప రస గంధాః పంచతన్మాత్రా పంచ పుష్పబాణాః"

బాణాలు :

దేవి చేతి యందు పుష్ప బాణమున్నది. అది ఒక పూవుకాదు. ఐదుపుష్పాలు. అవే పంచతన్మాత్రలు. పంచభూతాల ధర్మాలు వస్తువు యొక్క స్థూల స్వరూపమే గుణము. సూక్ష్మ రూపముతన్మాత్ర. బాణాలు మూడు రకాలు.

1. స్థూలములు - పుష్పబాణాలు
2. సూక్ష్మములు - బీజరూపాలు
3. కారణములు - వాసనారూపాలు

ఈ బాణాల పేర్లు ఒక్కొక్క చోట ఒక్కొక్క విధంగా ఉన్నాయి. 1. కాదిమతంలో

1. కమలము - ఎర్రతామర
2. రక్తకైరవము - తెల్లకలువ
3. కల్హారము - కొంచెము ఎరుపు రంగుకల కలువ
4. ఇందీవరము - నల్లకలువ
5. సహకారము - మామిడిపూవు.

దేవిచేతిలోని బాణాల వివరాలు ఇతర గ్రంధాలలో ఈ విధంగా ఉన్నాయి.

	కాలికాపురాణము	**జ్ఞానార్ణవము**	**తంత్రరాజము**
1.	హర్షణము	క్షోభణము	మదన
2.	శోచనము	ద్రావణము	ఉన్మాద
3.	మోహనము	ఆకర్షణము	మోహన
4.	శోషణము	వశ్యము	దీపన
5.	మారణము	ఉన్మాదము	శోషణ

దేవి చేతిలో బాణాలు తన్మాత్రలు. అందుకనే దేవి. 'పంచతన్మాత్రసాయకా' అని చెప్పబడింది.

21. "మన ఇక్షుధనుః వశ్యోబాణః రాగఃపాశో ద్వేషోంకుశః"

ధనుస్సు :

దేవి చేతిలో ఉన్న ఆయుధములు సాధకునిలో గల రాగద్వేషాలు

చెరకువిల్లు - సాధకుని మనస్సు
బాణము - వశ్యత
పాశము - అనురాగము
అంకుశము - ద్వేషము

22. "అవ్యక్త మహత్తత్త్వాహంకారాః కామేశ్వరీ, వజ్రేశ్వరీ, భగమాలిన్యోంతస్త్రి కోణాగ్రగాదేవతా"

అష్టమావరణ :

శ్రీచక్రంలో ఎనిమిదవ ఆవరణ త్రికోణము. అక్కడ ముగ్గురు దేవతలున్నారు. వారు సాధకుని మనసులోని ....

1. అవ్యక్తము - కామేశ్వరీ
2. మహత్తత్త్వము - వజ్రేశ్వరీ
3. అహంకారము - భగమాలినీ

వీరు శక్తిస్వరూపిణులయిన పార్వతి, లక్ష్మి సరస్వతులు.

23. "పంచదశతిథి రూపేణ కాలస్య పరిమాణావలోకనం పంచదశనిత్యాః"

అష్టమావరణ :

శ్రీచక్రంలో ఎనిమిదవ ఆవరణ అయిన త్రికోణంలో మూడు రేఖలున్నాయి. వాటిలో రేఖకు ఐదుగురు చొప్పున పదిహేను మంది దేవతలున్నారు. వీరినే నిత్యాదేవతలంటారు. ఈ నిత్యలు తిథుల స్వరూపాలు. వీటి వివరాలు ఈ క్రింద ఇవ్వబడినాయి.

తిథులు	-	**నిత్యా దేవతలు**
1. పాడ్యమి	-	కామేశ్వరీ
2. విదియ	-	భగమాలినీ
3. తదియ	-	నిత్యక్లిన్నా
4. చవితి	-	భేరుండా
5. పంచమి	-	వహ్నివాసినీ
6. షష్ఠి	-	మహావజ్రేశ్వరీ
7. సప్తమి	-	శివదూతీ
8. అష్టమి	-	త్వరితా
9. నవమి	-	కులసుందరీ
10. దశమి	-	నిత్యా
11. ఏకాదశి	-	నీలపతాకా

12. ద్వాదశి - విజయా
13. త్రయోదశి - సర్వమంగళా
14. చతుర్దశి - జ్వాలామాలినీ
15. పూర్ణిమ, అమావాస్య - చిత్రా

ఈ నిత్యల ధ్యానశ్లోకాలు, స్వరూపాలు నాచే వ్రాయబడిన 'శ్రీవిద్యాదర్పణము' లో ఇవ్వబడినాయి. నిత్యలు తిథుల స్వరూపాలు, తిథులు కళాస్వరూపాలు. వీటి వల్లనే కాలచక్రం తిరుగుతున్నది.

24. "శ్రద్ధానురూపాధీర్దేవతాతయోః కామేశ్వరీ సదానంద ఘనాపూర్ణా స్వాత్మైక రూపాదేవతా"

నవమావరణ : శ్రీచక్రంలో తొమ్మిదవ ఆవరణ బిందువు. ఇందున్న ప్రధానదేవతలు కామేశ్వరీ కామేశ్వరులు. ఇందులో సాధకుడి ఆత్మయే కామేశ్వరి, బుద్ధి కామేశ్వరుడు. కాబట్టి సాధకుడి ఆత్మ, దేవి రెండూ ఒక్కటే. ఎప్పుడయితే తన ఆత్మ దేవి స్వరూపం అయిందో, అప్పుడు అతడు పరబ్రహ్మ అవుతాడు. దీనినే బ్రహ్మాత్మైక్యాను సంధానము అంటారు. ఇదే జీవన్ముక్తి.

25. "సలిలమితి సాహిత్యకరణగ్ం సత్వమ్"

ఇక్కడ నుంచి అంతర్యాగము వివరించబడుతోంది. బాహ్యమైన వస్తువులన్నీ విషయ వాంఛలకు ప్రతీకలు. కాబట్టి వాటిని వదలి పెట్టెయ్యాలి. శరీరంలో ఉండే వస్తువుల చేతనే పూజ జరగాలి. పూజకు ముఖ్యమైనది జలము. సాధకుని శరీరంలో సత్వ రజ స్తమో గుణాలన్నాయి. వీటిలో మొదటి దానిని పెంపొందించి, మిగిలిన రెండింటినీ తగ్గించాలి. సత్వగుణమే జలము.

26. "కర్తవ్యమకర్తవ్య మౌదాసీన్యమితి వివేక భావనాయుక్త ఉపచారః"

ఉపచారాలు :

బాహ్యపూజలోదేవికి రాజోపచారాలు, దేవోపచారాలు, మంత్రోపచారాలు అని వివిధ రకాలైన ఉపచారాలున్నాయి. అయితే అంతఃపూజలో ఉపచారము అంటే నిత్యము కాని వాటిని వదలి వేయటము. బ్రహ్మపదార్థమే సత్యము కాబట్టి మిగిలినవి వదలివేయాలి. ఉదాసీనభావము తూష్ణీభావంగా రూపొందకూడదు. ఇదే అంతఃపూజలో ప్రధానమైన ఉపచారము.

27. "అస్తి నాస్తీతి కర్తవ్యతా అనుపచారః"

అనుపచారాలు :

బ్రహ్మము ఒక్కటే సత్యము, నిత్యము. అది కనిపించనంత మాత్రం చేత లేదు అనుకోరాదు. సర్వజీవరాశులయందు పరబ్రహ్మమున్నది. అంతేకాని బ్రహ్మము లేదనుకోవటము అపచరాము, తెలియని తనము, అపరాధము. ఇదే అనుపచారము, చేయతగనిది.

28. "బాహ్యాంతఃకరణానాం రూపగ్రహణ యోగ్యతాస్తి త్యావాహనమ్"

ఆవాహన :

దేహంలో బాహ్యేంద్రియాలు, అంతరింద్రియాలున్నాయి. ఆత్మ అనేది ఈ ఇంద్రియాల ద్వారానే ప్రకాశిస్తోంది. కాబట్టి వాటి యొక్క దేవతారూపాన్ని ఆవాహన చెయ్యటమే దేవిని అవాహన చెయ్యటము.

29. "తస్యబాహ్యాంతః కరణానామేకరూప విషయ గ్రహణమాసనమ్"

ఆసనము :

శరీరంలో ఉన్న జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు, మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము అనే పధ్నాలుగు విభిన్నమైన ధర్మాలు కలిగి ఉన్నాయి. ఆ ధర్మాలను అరికట్టి సర్వము బ్రహ్మపదార్థము అని భావించటమే ఆసన సమర్పణ.

30. "రక్త శుక్ల పదైకీకరణం పాద్యమ్ "

పాద్యము : అంటే కాళ్ళు కడుక్కునేనీరు. ఆ దేవి సాధకుడి శరీరంలో ద్వాదశాంతంలో ఉన్నది. బ్రహ్మము (ప్రకాశ శక్తి) ఆత్మశక్తిలో ప్రవేశించి శుక్ల బిందువయింది. విమర్శశక్తి శుక్ల బిందువులో ప్రవేశించి రర్తబిందువయింది. ఈ రెండింటి కలయిక వలన మిశ్రమ బిందువు ఏర్పడింది. ఇప్పుడు .....

రక్తబిందువు	-	చంద్రుడు
శుక్ల బిందువు	-	అగ్ని
మిశ్రమ బిందువు	-	సూర్యుడు

మిశ్రమబిందువు నుంచి నాదము, దాని నుంచి కళలు ఆవిర్భవిస్తాయి. ఇప్పుడు మిశ్రమ బింధుస్వరూపమైన కామేశ్వరీద్వంధము యొక్క

కుడికాలు - శుక్ల వర్ణమైన ప్రకాశాంశము
ఎడమకాలు - రక్తవర్ణమైన విమర్శాంశము.

ఈ రెండు పాదాలను ధ్యానిస్తూ వాటికి భేదము లేదు అనుకోవటమే పాద్యము.

31. "ఉజ్జ్వల దామోదానుసంధానమర్ఘ్యమ్"

అర్ఘ్యము :

అంటే చేతులు కడుక్కునే నీరు. శ్రమ తీరటానికి ఇచ్చే అల్పాహారం. అంటే త్రాగేందుకు ఇచ్చేనీరు. అంతఃపూజలో ఆత్మయే శ్రీదేవి అని గ్రహించి బ్రహ్మానందాను సంధానము చెయ్యటమే అర్ఘ్యప్రదానము.

32. "స్వచ్ఛంస్వతస్సిద్ధ మిత్యాచమనీయమ్ "

ఆచమనము :

ఆచమనము అంటే మంత్ర పూర్వకంగా నోటిలోకి తీసుకునే నీరు. ఆత్మస్వరూపమైన దేవి స్వచ్ఛమైనది. అస్వచ్ఛత స్వయం సిద్ధమైనది అని గ్రహించుట.

33. "చిచ్చంద్రమయీ సర్వాంగస్రవణగ్ం స్నానమ్"

స్నానము :

బాహ్యపూజలో దేవతకు పంచామృత స్నానము చేయిస్తారు. కాని అంతఃపూజలో అదిలేదు. కుండిలినీ శక్తి ఆధారచక్రంలో నిద్రిస్తూ ఉంటుంది. సాధకుడు ప్రాణాయామం చేసి కుండలినీ శక్తిని గనక నిద్రలేపినట్లైతే, అది షట్చక్రాల గుండా ప్రయాణించి, గ్రంధి త్రయాన్ని భేదించి సహస్రారం చేరి తననోటితో సహస్రదళ పద్మాన్ని కరిచి పట్టుకుంటుంది. అప్పుడు సహస్రారము అనే చంద్రమండలం నుండి అమృతధారలు స్రవించి శరీరంలోని డెబ్బైరెండువేల నాడీ మండలాన్నీ తడుపుతాయి. ఈ రకంగా అమృతవర్షము కురిపించటమే ఆత్మదేవత (పరదేవత)కు స్నానము. ఈ రకంగా అమృతవర్షము వలన శరీరము సమశీతోష్ణమవుతుంది.

34. "చిదగ్ని స్వరూప పరమానందశక్తి స్ఫురణం వస్త్రం"

వస్త్రము :

వస్త్రము అంటే శరీరాచ్ఛాదనకు ఉపయోగించేది. సాధకుని శరీరంలోని కాంతి అంతా ఆపరాశక్తి యొక్క తేజస్సే. ఈ విషయం తెలిసి బ్రహ్మానందము పొందుటయే వస్త్ర ప్రదానము,

35. "బ్రహ్మనాడీ బ్రహ్మసూత్రమ్"

యజ్ఞోపవీతము : దీన్నే బ్రహ్మసూత్రము అంటారు. జగత్తు అంతా బ్రహ్మమయమని సూత్రము కాబట్టి ఇది బ్రహ్మసూత్రము. దేహంలో ఉండే నాడులలో సుషుమ్నానాడి ముఖ్యమైనది. దీన్నే బ్రహ్మనాడి అని కూడా అంటారు. అంతః పూజలో ఈ సుషుమ్నానాడినే బ్రహ్మసూత్రము అని భావించాలి.

గాయత్రీ మంత్రానికి ప్రతీక యజ్ఞోపవీతము. తొంభై ఆరు బెత్తలు ప్రమాణం కల సూత్రము (దారము) తయారు చేసి దాన్ని మూడుచుట్లు చుట్టాలి. ఇప్పుడు రెండు చివరలు కలిపి ముడివెయ్యాలి. ఇందులోని సూత్రములో మూడుపోగులుంటాయి. అంటే మొత్తం ఇరవై ఏడు పోగులు ఉంటాయి. తొంభై ఆరు బెత్తలు ప్రమాణము - తత్త్వములు.

మూడు ఆవృతులు	-	త్రిగుణములు
మూడు ముడులు	-	మూడుగ్రంథులు
మూడు గ్రంథులు	-	బ్రహ్మముడి
ఇరవైఏడు పోగులు	-	ఇరవై ఏడు భేదములు కల జగత్తు.

బ్రాహ్మణులు యజ్ఞోపవీతాన్ని ధరించి కర్మలు చేస్తారు. యజ్ఞోపవీతాన్ని తీసివేయటమంటే సన్యాసం స్వీకరించటము. అట్టి సన్యాసి బ్రహ్మకాండను చేసేవాడు, సర్వకర్మ విముక్తుధు, జీవన్ముక్తుడు.

సుషుమ్నానాడిలో సూక్ష్మనాడులు కలిసే చోటును గ్రంథి అంటారు. అది ఇరవై ఏడు సూక్ష్మనాడుల సమూహము. అందుకనే సుషుమ్నానాడి యజ్ఞోపవీతము కంటె సత్యమైనది. సహజమైనది. ఇదే కంఠ సూత్రము.

36. "స్వవ్యతిరిక్తవస్తు సంగరహిత స్మరణం విభూషణమ్"

ఆభరణాలు :

దేవతకు కంఠ సూత్రంతో పాటుగా వివిధ ఆభరణాలు సమర్పించాలి. సాధకుడు తాను కూడా పరబ్రహ్మస్వరూపమే అని, మాయా మోహం చేత తాను మనిషిగా ఉన్నానని గ్రహించి మాయాది వస్తువులతో తనకు సంబంధము లేదు అని వాటిని పరిత్యజించటమే దేవికి ఆభరణములు అర్పించటము.

37. "సత్సంగపరిపూతాను స్మరణం గంథః"

గంధము :

దేహానికి గంధం రాసుకోవటం చేత సువాసన రావటమే కాకుండా పవిత్రత కూడా వస్తుంది. సాధకుడి సహస్రారంలో ఆ పరాశక్తి ఉన్నదని, దాని కాంతిచేతనే అతని శరీరము తేజస్సుతో ప్రకాశిస్తుందని చెప్పటం జరిగింది. ఈ రకంగా జరగటం చేత సాధకుడు తాను ఎప్పుడూ పవిత్రుడనే అనే భావం కలిగి ఉంటాడు. ఇదే దేవికి శ్రీచందనం సమర్పణ.

38. "సమస్త విషయాణాం మనసః సైర్యేణానుసంధానం కుసుమమ్"

పూజ :

భగవంతుని భక్తుడు నానావిధ పుష్పాలతో పూజిస్తాడు. ఇంద్రియవాంఛలకు లోనుగాకుండా, మనసును పరబ్రహ్మ మందు లయం చేసి, సర్వము బ్రహ్మమమని తెలుసుకోవటమే పుష్పపూజ.

"అహింసా ప్రథమ పుష్పం, పుష్పమింద్రియనిగ్రహః ।
దయాక్షమాజ్ఞానపుష్పం పంచపుష్పం తతఃపరం" ॥

అహింస, ఇంద్రియ నిగ్రహము, దయ, క్షమ, జ్ఞానము అనేవి పంచపుష్పాలు. సాధకుడు అరిషడ్వర్గాలు జయించి, అహంకారమనే పుష్పంతో దేవిని పూజించాలి. అంటే ఈ స్థితిలో నేను అహంకారాన్ని, నాది అనే భ్రాంతిని వదలివెయ్యాలి.

39. "తేషామేవ సర్వదాస్వీకరణం ధూపః"

ధూపం :

సాధకుడు ఇంద్రియచాపల్యానికి లోనుగాకుండా, ఇంద్రియాలను తన స్వాధీనంలో ఉంచుకోవటమే ధూపము.

40. "పవనావచ్ఛిన్నోర్ధ్వజ్వలన సచ్చిదుల్కాకాశదేహో దీపః"

దీపం:

బ్రహ్మతేజస్సు వాయువుతో కలసి జ్వాలగా ప్రకాశిస్తుంది. అది విశ్వమంతా వ్యాపించి ఉంది. సాధకుడి శరీరము పరబ్రహ్మము యొక్క కాంతి పుంజములతో ప్రకాశిస్తోంది. ఇప్పుడు సాధకుడు ఆకాశాన్నే తన శరీరంగా భావించి, తన శరీరంలో ఉన్న ఆ పరాశక్తిని, చిత్కలను దీపముగా భావించటమే దేవికి దీపసమర్పణ.

41. "సమస్తయాతాయాత వర్జనం నైవేద్యమ్"

నైవేద్యము :

పూజానంతరము నైవేద్యము చెయ్యాలి. ఇంద్రియచాంచల్యము లేకుండా అంటే ఇంద్రియాలను జయించి బ్రహ్మాకారవృత్తితో ఉండటమే నైవేద్యము. ఇది బ్రహ్మానందానుభవము.

42. "అవస్థాత్రయైకీకరణం తాంబూలమ్"

తాంబూలము :

ఆకు వక్క సున్నము కలిస్తే తాంబూలము అవుతుంది. అవే జాగ్రత్స్వప్న సుషుప్తి అనే మూడు అవస్థలు. ఆమూడు అవస్థలను తురీయావస్థలో విలీనం చెయ్యటమే తాంబూల సమర్పణ.

43. మూలాధారాది బ్రహ్మబిల పర్యంతం, బ్రహ్మరంధ్రాదిమూలాధారపర్యంతం గతాగత రూపేణ ప్రాదక్షిణ్యమ్."

ప్రదక్షిణము :

శరీరంలో ప్రాణవాయువు ఆధారచక్రం నుండి సహస్రారము వరకు, సహస్రారం నుంచి ఆధారచక్రం వరకు సుషుమ్నా మార్గం గుండా తిరుగుతూ ఉంటుంది. ఈ రకంగా ప్రాణవాయువు సంచారము చెయ్యటమే ఆత్మరూపంలో ఉన్న దేవతకు ప్రదక్షణము. దీనికే అజపారూప హంస అని పేరు.

హ కారసంజ్ఞ గల పరమాత్మ స కార సంజ్ఞగల ప్రకృతితో కలసి హంసరూపమైన శబల బ్రహ్మము అవుతాడు. ఈ శబలబ్రహ్మము తొమ్మిది ద్వారాలు గల మానవశరీరము అనే పట్టణంలో ప్రవేశించి ఇంద్రియములు, ప్రాణములు, మనస్సుతో కూడినవాడై పంజరంలో బంధించబడిన పక్షిలాగా బయటకు వచ్చే ఉపాయం తెలియక ప్రాపంచిక బంధనాలతో కొట్టుమిట్టాడు తున్నాడు. అంటువంటి హంస అనబడే జీవుడికి.

అగ్ని, చంద్ర మండలాలు	-	రెక్కలు
ఓంకారము	-	శిరస్సు
జ్ఞాననేత్రము	-	ముఖము
హకరసకారములు	-	పాదాలు

(హకారము రుద్ర బీజము సకారము శక్తి బీజము)

ఈ రకంగా ఉన్న హంస అనే జీవుడు పాలలో ఉన్న నెయ్యి లాగా సమస్త ప్రాణికోటినీ ఆశ్రయించి ఉన్నాడు.

సహస్రారము అనేది ఎనిమిది దళాలు కలిగిన పద్మము. ఇందులోని ఒక్కొక్క దళంలోనూ చిన్నచిన్న రేకులు నూట ఇరవై అయిదు చొప్పున ఉంటాయి. ఈ రకంగా మొత్తం వెయ్యి దళాలుంటాయి. అందుకే దాన్ని సహస్రదళకమలం అంటారు. ఎనిమిది దళాలు ఎనిమిది దిక్కులకు తిరిగి ఉంటాయి.

ఎనిమిది దళాల వివరాలు ఈ విధంగా ఉంటాయి.

తూర్పుదిక్కు	-	సద్బుద్ధి
ఆగ్నేయం	-	నిద్ర, దప్పిక, ఆలస్యము
దక్షిణం	-	క్రూర బుద్ధి
నైరుతి	-	తాపబుద్ధి
పడమర	-	విలాసము
వాయువ్యము	-	నడచుట మొ॥ విషయములందుబుద్ధి
ఉత్తరము	-	సురతము నందు ఆసక్తి
ఈశాన్యము	-	ద్రవ్యము దానంచేసే తలంపు
పద్మాంతరాళంలో	-	ఇహపరలోకవిముక్తి
కింజల్కము (తామరపువ్వులోని కేసరములు)	-	మెలకువ
తామరదుద్దు	-	కల
దుంప	-	నిద్ర

ఆత్మ ఏక్షణాన సహస్రారాన్ని వదులుతుందో ఆక్షణములోనే పరబ్రహ్మలో ఐక్యమవుతుంది. దీనికే తురీయావస్థ అని పేరు.

44. "తురీయావస్థా నమస్కారః"

నమస్కారము: దేవికి నమస్కారము చెయ్యటమంటే సాధకుడు తురీయావస్థ చేరటమే.

45. "దేహశూన్య ప్రమాతృతా నిమజ్జనం బలిహరణమ్"

బవిహరణము :

సాధకుడి స్థూలశరీరము మాయతో కూడుకున్నది. సూక్ష్మశరీరము జ్ఞాన స్వరూపము తాను జ్ఞానస్వరూపుడు కాబట్టి జీవాత్మను పరమాత్మ యందు విలీనం చేసినట్లు భావించటమే బలిసమర్పణ.

46. "సత్యమస్తికర్తవ్య మకర్తవ్య మౌదాసీన్య నిత్యాత్మ విలాపనగ్ంహోమః"

ధ్యానము :

సాధకుడు తాను ఆదేవి యొక్క పాదముల నుండి వచ్చే తేజస్సులో విలీనమయినట్లుగా తలచి, తానుకుడా ఆ తేజస్సులో ఒక భాగమేనని, సర్వము పరబ్రహ్మమయని భావించటమే పరిపూర్ణ ధ్యానము.

47. "స్వయం తత్పాదుకా నిమజ్జనం పరిపూర్ణధ్యానమ్"

ధ్యానము:

సాధకుడు తాను ఆదేవి యొక్క పాదముల నుండి వచ్చే తేజస్సులో విలీనమయినట్లుగా తలచి, తానుకుడా ఆతేజస్సులో ఒక భాగమేనని, సర్వము పరబ్రహ్మమయని భావించటమే పరిపూర్ణ ధ్యానము.

48. "ఏవ ముహూర్తత్రయం భావనయా యుక్తో భవతి, తస్య దేవతాత్మైక్యసిద్ధిః"

బ్రహ్మత్వసిద్ధి :

ఈ విధంగా తననుతాను పరబ్రహ్మ స్వరూపంగా భావించి మూడు ముహూర్తముల కాలము దేవియందు మనసు లగ్నం చేసినవాడు ఆ దేవిలో ఐక్యత పొందుతాడు. దీనినే బ్రహ్మత్వం సిద్ధించటం అంటారు.

49. చించితకార్యాణ్యత్నేన సిద్ధ్యంతి స ఏవ శివయోగీతి కథ్యత ఇత్యుపనిషత్ ॥

ఫలము :

ఈ విధంగా అంతః పూజచేసి సిద్ధుడైన సాధకుడికి కోరిన కోరికలు అప్రయత్నంగా నెరవేరతాయి. అతడినే శివయోగి అంటారు అని ఈ ఉపనిషత్తులో చెప్పబడింది.

శ్రీ క్రోవి పార్థసారథి గారి ఇతర గ్రంథములు

శ్రీవిద్యా దర్శనము	50-00
శ్రీవిద్యా రహస్యము	60-00
శ్రీవిద్యా దర్పణము (శుభగోదయ స్తుతికి వివరణ)	60-00
దేవీ కథాసుధ (దేవీ మహాత్మ్యమును వివరించే కథలు)	60-00
శ్రీవిద్యా సర్వస్వము (కామకలా విలాసమునకు వివరణ)	75-00
శ్రీవిద్యా పంచదశీ (పంచదశీ మహామంత్ర, గాయత్రి మంత్ర, లలితా త్రిశతిలకు వివరణ)	75-00
శ్రీవిద్యా హృదయము (యోగినీ హృదయమునకు వివరణ)	75-00
శ్రీవిద్యా మహాయంత్రము (శ్రీచక్ర వివరణ, అర్చనలతో)	80-00

మావద్ద అన్ని కంపెనీలు, ఆశ్రమముల జ్యోతిష్య, వాస్తు, అధ్యాత్మిక, స్మార్త, పురాణ, ఆయుర్వేద, సంగీత, యోగా, పూజా పుస్తకములు, స్తోత్రములు, వ్రతకల్పములు, సంప్రదాయ గ్రంథములు లభించును.

వి.పి.పి. సౌకర్యము కలదు.

శివకామేశ్వరి గ్రంథమాల

41-22/4-36, భ్రమరాంబాపురం, కృష్ణలంక,
విజయవాడ - 520 013. ఫోన్ : 522824